కథ

# అదీ విషయం!

తిరుమలశ్రీ

**నేటి ఫాస్ట్ లైఫ్‌లో దూరంలో ఉన్న స్నేహితుల్ని, బంధువుల్ని తరచూ కలుసుకునేందుకు వీలుపడకుండాపోతోంది. కేబుల్ టీవీల పుణ్యమా అంటూ సోషియల్ కాల్స్ కూడా తగ్గిపోయాయి. ఆరోజు ఆదివారం. ఇద్దరు ముగ్గురు మిత్రులనయినా పలకరించి రావాలని బయలుదేరాను.**

ముందు కృష్ణమూర్తి ఇంటికి వెళ్లాను. ఇంట్లోనే ఉన్నాడు వాడు. నేను వెళ్లేసరికి ఎవరిమీదో కేకలు వేస్తున్నాడు. నన్ను చూడడంతో ఆప్యాయంగా ఎదురొచ్చి కౌగిలించుకున్నంత పని చేశాడు

''ఎన్నాళ్లకెన్నాళ్లకురా!'' అంటూ.

గదిలో పడుకుని ఉన్న కృష్ణమూర్తి తండ్రిని పలుకరించి వచ్చి హాల్లో కూర్చున్నాం ఇద్దరమూను.

కృష్ణమూర్తి భార్య తెచ్చిచ్చిన కాఫీ సిప్ చేస్తూ, ''ఎవరిమీదరా ప్రొద్దుటే అరుస్తున్నావు?'' అనడిగాడు కృష్ణమూర్తిని.

వాడు జవాబిచ్చేలోపునే వాడి భార్య అందుకుని, ''ఆయనకు లోకువ నేనే కదన్నయ్యా!'' అంది నవ్వుతూ.

''డెంగ్యూ దోమ ఏదైనా కుట్టిందా వీణ్ణి!'' అన్నాడు వీడి వంక చూస్తూ.

దానికీ ఆవిడే జవాబిచ్చింది. ''మావయ్యగారు బాత్‌రూంకి వెళుతూంటే మేము ఆయన చేయి పట్టుకుని తీసుకువెళ్లలేదనీ ఆ గొడవ. ఆయన అవసరం లేదు మొర్రో అంటూంటే మేమేం చేస్తాం?''

ఆశ్చర్యంగా చూశాను వీడి వంక.

''ఔన్రా సత్యం! నాన్నగారి వయసు డెబ్బై దాటిపోయింది కదా! ఆరోగ్యంగానే ఉన్నా నడిచేటప్పుడు అనుకోకుండా ఏ వొళ్లు తూలో,
కళ్లు తిరిగో కిందపడిపోతేనో!'' అన్నాడు వాడు.

అయితే నేను వీడి వంక ఆశ్చర్యంగా చూసింది, భార్య మీద కేకలు వేశాడని కాదు. 'తండ్రి మీద శ్రద్ధ వాడికి ఇంత హఠాత్తుగా ఎలా పుట్టుకొచ్చిందా!' అని.

కారణం. నిన్న మొన్నటివరకు తండ్రంటే అంటీముట్టనట్టుగా ఉండేవాడు కృష్ణమూర్తి. ఆయన ఎప్పుడైనా నీరసంగా ఉండి చేయూత కోరితే విసుక్కునేవాడు కూడాను. అలాంటిది, ఇప్పుడు అకస్మాత్తుగా వాడి ప్రవర్తనలో మార్పు వచ్చిందంటే, హేతువు కోసం మదిలోనే అన్వేషణ ఆరంభించాను.

''వయసు పైబడితే మాత్రం? మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్న మనిషిని మనం జబ్బు మనిషిలా ట్రీట్ చేయడం ఏం బావుంటుంది చెప్పన్నయ్యా! మావగారు మంచం మీంచి లేచి నిలుచుంటే చాలు, ఆయనంతట ఆయన్ని నాలుగు అడుగులు వేయనివ్వరు ఈయన. పడిపోతారు, పడిపోతారంటూ అతి జాగ్రత్త చూపుతూ సైకలాజికల్‌గా ఆయనలో భయాన్ని రేకెత్తిస్తున్నారు'' ఫిర్యాదు చేసింది కృష్ణమూర్తి భార్య.

''ఆశ్చర్యంగానే ఉందమ్మా. అసలు ఈ ఫోబియా ఎప్పట్నుంచి ఆరంభమయింది వీడికి?'' అనడిగాను విస్తుబోతూ.

''ఈమధ్యే...వారం నుండి'' అందామె.


వాడి ముఖంలోకి అనుమానంగా చూస్తూ, ''మీ నాన్నగారి పేరుతో లాటరీ ఏదైనా తగిలిందేమిట్రా?'' అనడిగాను.

వాడి భార్య కిసుక్కున నవ్వింది.

నా భావం అర్థమైనట్టు మోచేత్తో నా డొక్కలో పొడిచాడు కృష్ణమూర్తి. ''ఏడిశావ్‌లే! ఆస్తి కోసం కాకా పట్టేవాడిలా కనిపిస్తున్నాన్రా నీకు?'' అన్నాడు కోపం నటిస్తూ.

కృష్ణమూర్తి తండ్రి బిజినెస్‌లో బాగానే సంపాదించాడు. ఏకైక సంతానం కావడంతో అదంతా కృష్ణమూర్తికే చెందుతుంది. తల్లి కాలం చేసి కూడా అయిదారేళ్లయిపోయింది.

ఏదేమైనా, తండ్రిని వాడు శ్రద్ధగా చూసుకుంటు



న్నందుకు సంతోషం కలిగింది నాకు.

నా అనుమానాన్ని పటాపంచలు చేయడానికి అన్నట్టు, ''వారం క్రితం మన సీతారాం తండ్రి కిందపడి తుంటి ఎముక విరగ్గొట్టుకున్నాడు, తెలుసా?'' అనడిగాడు.

తెలీదన్నాను.

''ఆపరేషన్ చేస్తే కాంప్లికేషన్స్ రావచ్చునని ఎటూ తేల్చకుండా ఉన్నారు డాక్టర్స్'' చెప్పాడు.

సీతారాం మా ఫ్రెండ్. అతని తండ్రికి డెబ్బై అయిదేళ్లుంటాయి. చాన్నాళ్లుగా అనారోగ్యంతో మంచానికే అంకితమైపోయాడు. డైనింగ్ టేబిల్ దగ్గరకు, బాత్‌రూంకీ తప్ప లేచి నడవడు. అప్పుడే నడక నేర్చుకున్నట్టు తప్పటడుగులేస్తూంటాడు. అతనికింకా ఓ కూతురు, కొడుకు ఉన్నా పెద్దకొడుకైన సీతారాం దగ్గరే ఉంటాడు. సీతారాం, అతని భార్య, పిల్లలూ ముసలాయన్ని చాలా శ్రద్ధగా చూసుకుంటూంటారు. సీతారాంకు తల్లి లేదు. తండ్రికి వచ్చే పెన్షన్ డబ్బుల్ని సీతారామ్ వాడుకోడు. వాటిని బ్యాంక్‌లో వేసి పండుగలకూ పబ్బాలకూ చెల్లెలికి తండ్రి ద్వారానే ఇప్పిస్తుంటాడు. అదే ఊళ్లోనే చిన్న కొడుకు మంచి స్థితిలోనే ఉన్నా, తండ్రి గురించి అంతగా పట్టించుకోడు.

సీతారాం తండ్రి ఓ సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్లో ఉన్నాడని విని, రూమ్ నెంబర్ తీసుకుని, అతన్ని చూసి వద్దామని బయలుదేరాను.

నేను హాస్పిటల్‌కి చేరుకునేసరికి సీతారాం అక్కడే ఉన్నాడు. అతని తండ్రిని పరామర్శించి, ఆ విషయం నాకు ఫోన్ చేసి చెప్పనందుకు సీతారాంని చివాట్లు వేశాను.

అప్పుడు చెప్పాడు అతను.

తండ్రి మంచం మీంచి లేచి నిలుచుంటే హఠాత్తుగా కళ్లు తిరగడంతో నేలమీద పడిపోయాడట. కోడలు కంగారుపడుతూ పైకి లేవదీస్తే నిలుచోలేకపోయాడట. కూర్చోలేక గిలగిలలాడిపోయాడట. ఆమె ఫోన్ చేస్తే సీతారాం ఆఫీసు నుంచి పరుగెత్తుకొచ్చాడట. వెంటనే అంబులెన్స్ తెప్పించి ఆ హాస్పిటల్‌కి తీసుకువచ్చి అడ్మిట్ చేశాడట.

''డాక్టర్స్ ఏమన్నారు?'' అనడిగాను.

''తుంటికి ఆపరేషన్ చేయాలట. చేస్తే హార్ట్‌కి రిస్క్ ఉందట'' అన్నాడు దైన్యంగా.

''సారీ! నీ మెంటల్ కండిషన్ అర్థం చేసుకోకుండా నీమీద కోపగించుకున్నాను'' అన్నాడు.

''ఇది చాలదన్నట్టు, పోలీసుల బెడద ఒకటి!'' అని సీతారాం అంటూంటే ఆశ్చర్యంగా చూశాను.

''అదే, నాన్న ఎలా పడిపోయారో వివరించినా, ఈ హాస్పిటల్ వాళ్లు దీన్ని మెడికో లీగల్ కేసుగా రిజిస్టర్ చేశారు.''

''అదేమిటీ?!'' తెల్లబోయాను నేను. కాలు తూలి నేలమీద పడితే... మెడికో లీగల్ కేసా!

''ఔను. ఈమధ్య ఇలాంటి కేసులన్నిటినీ అలాగే ట్రీట్ చేస్తున్నారట!'' చెప్పాడు అతను. ''వాళ్లు పోలీసులకి ఇన్‌ఫాం చేయడమూ, వాళ్లొచ్చి అర్థం పర్థం లేని ప్రశ్నలతో మా ప్రాణాలు తీయడమూను!''

''ఏమంటారు వాళ్లు?''

''ఆయన అనారోగ్యంతో కొన్నాళ్లుగా మంచం మీదే ఉన్నారనీ, లేచి నిలుచుంటే కళ్లుతిరిగి పడిపోయారనీ మేమెంత మొత్తుకున్నా వినకుండా, ఏవేవో స్టుపిడ్ క్వొశ్చన్స్ వేస్తున్నారు. ఎలాగోలాగున మా నుంచి ఫోర్స్‌డ్ కన్ఫెషన్ ఏదో రాబట్టేందుకు వాళ్లు డిసైడ్ చేసుకున్నట్టు అనిపిస్తుంది నాకైతే!'' అంటూ మళ్లీ ఏమేమి ప్రశ్నలు వేశారో చెప్పుకొస్తుంటే, నిర్ఘాంతపోవడం నా వంతయింది.

ముసలాయిన్ని ఎవరు తోసేశారు? ఎలా తోసేశారు? ఎక్కణ్నుంచి తోసేశారు?



ఎందుకు తోసేశారు? ఆయనకు వెనుక ఆస్తిపాస్తులు ఏమున్నాయి? అవన్నీ ఎవరికి చెందుతాయి? ఆయన వీలునామా ఏదైనా రాశారా? డైరెక్ట్ బెనిఫిషియరీ మీరే? మీ భార్య మీ తండ్రిని సరిగా చూసుకుంటుందా? నువ్వు ఇంటిదగ్గర లేనప్పుడు ఆవిడే అతన్ని తోసేసి ఉండొచ్చుగా?... ఇదట పోలీసుల ఇంటరాగేషన్ ధోరణి!

తలుచుకున్నప్పుడల్లా వచ్చి మళ్లీ బుర్రలు తినేసి, చివరికి కేసు రాసుకుని వెళ్లారట.

''సింపుల్ విషయాన్ని మెడికో లీగల్ కేసుగా ఎలా చేశారో హాస్పిటల్ అథారిటీస్‌ని నిలదీయలేకపోయావా?'' అన్నాను నేను కోపంగా.

''అదీ చేశాను. ఈమధ్య ఆస్తి కోసమో, మరే కారణంగానో అయినవాళ్లే వృద్ధులకు అపకారం తలపెడుతున్న కేసులు చాలా వస్తున్నాయట. అందుకని వారికి చెందిన యాక్సిడెంటల్ ఫాల్స్‌ని సైతం మెడికో లీగల్ కేసులుగా రిజిస్టర్ చేసి పోలీస్‌కి ఇన్‌ఫాం చేయవలసిందిగా ప్రభుత్వం జారీ చేసిందట.''

నా నోటమ్మట మాట రాలేదు.

అంతలోనే హఠాత్తుగా స్ఫురించింది నాకు, కృష్ణమూర్తికి తన తండ్రిమీద శ్రద్ధ అంత హఠాత్తుగా ఎందుకు పుట్టుకొచ్చిందో!

అది- తండ్రిమీద ప్రేమకాదు. ఆయన కింద పడి ఏ ఫ్రాక్చరో చేసుకుంటే పోలీస్ కేసవుతుందన్న భయం!

కాని ఉద్దేశ్యం ఏదైనా, వాటిని మెడికో లీగల్ కేసులుగా పరిగణించడం ఎంతవరకు న్యాయం? అన్న ప్రశ్న నా మెదడులో తెలుకొండిలా పొడుస్తూనే ఉంది ఇప్పటికీను!

## మనీషా రూటే వేరు!

**నేపాలీ భామ మనీషా కొయిరాలా బాలీవుడ్‌లోకి వచ్చి దాదాపు పదిహేనేళ్లు అవుతోంది. ఇక హీరోయిన్‌గా రాణించడం కష్టమనే నిర్ణయానికొచ్చినట్టే వుంది. ఇటీవలే నేపాల్ రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలనే నిర్ణయాన్ని ప్రకటించిన మనీషా- మరో ఆలోచనతో కూడా వుందిప్పుడు. ముంబాయిలో బ్రహ్మాండమైన బార్‌ని తెరవాలని సన్నాహాలు చేస్తోంది అంటున్నారు బాలీవుడ్ జనాలు. ఆహ్లాదకరమైన సంగీతాన్ని అందిస్తూ, వెరైటీ డ్రింకుల్ని కస్టమర్లకి అందివ్వగల స్పెషాలిటీని ఈ బార్‌కి సొంతం చేయాలనేది మనీషా ఆలోచనట.**